క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌గా ప్రహ్లాద



బాధ్యతలు చేపడుతున్న ప్రహ్లాద

కమలాపురం: కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బి. ప్రహ్లాద బాధ్యతలు చేపట్టారు. కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కాగా ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న పగడాల జగన్నాథ్ జూన్ 13న మడకశిర కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తా



మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ తదితరులు

లింగాల : కర్ణాటక రాష్ట్రంలోని గౌరిబిదనూర్‌లో జరిగిన 7వ జాతీయస్థాయి ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ జాతీయస్థాయి పోటీల్లో పార్నపల్లె శ్రీ బాలాజీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ ఎం.లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన తెలుపుతూ తమ పాఠశాలకు చెందిన షేక్ మహమ్మద్ నిసార్ గోల్డ్ మెడల్, ఆర్.కుషల్ కుమార్ సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ కె.రాజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉచిత శిక్షణ

జమ్మలమడుగు: పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత డేటా ఎంట్రీ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పాలిటెక్నికల్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు నూతన సాంకేతికను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా ఈ శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9666172953 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

జమ్మలమడుగు: అనారోగ్యంతో చాపాడు మండలం నక్కలదిన్నె గ్రామపంచాయతీకి చెందిన వీఆర్‌ఏ సునీల్‌కుమార్ (36) మరణించాడు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రకాష్ నగర్‌లో బస్ స్టాప్ వద్ద అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట అనాథశవంగా గుర్తించి వివరాలు సేకరించారు. సునీల్‌కుమార్ మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు



వరదనీటితో ప్రవహిస్తున్న చిత్రవతి

కొండాపురం: మండలంలో మూడు రోజులు నుంచి కురుస్తున్న వర్షానికి పొట్టిపాడు గ్రామ సమీపంలో వాగులు వంకలు ఉధృతంగా ప్రవాహిస్తున్నాయి. అలాగే ఎస్. తిమ్మాపురం గ్రామ సమీపంలో వంకలో వరదనీరు పోటెత్తుతోంది. దీంతో రెండ నెలలుగా వర్షాలు లేక అన్నదాతలు నిరాశపడుతున్న సమయంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పొలాలు పదును కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెన్నా, చిత్రవతి నదులు వరదనీటితో కళకళలాడుతున్నాయి.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం దీక్షలను యూనియన్ నగర సహాయ కార్యదర్శి ఇ. ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్. రవి, కె. శ్రీరాములు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామన్న హామీ ఇంతవరకూ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం అదనపు కార్మికులకు వేతనాలు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదనంగా తీసుకొన్న కోవిడ్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రైతుల చూపు.. సేంద్రియం వైపు

- క్రిమి సంహారక మందులతో క్షీణిస్తున్న భూసారం
- ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతల ఆసక్తి
- పెరుగుతున్న జీవామృతం తొట్ల నిర్మాణం

సింహాద్రిపురం : మండలంలోని రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. వేలల్లో ఖర్చయ్యే రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకానికి స్వస్తి పలికి సొంతంగా కషాయాలను తయారు చేస్తున్నారు. పంచగవ్య, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, కంపోస్టు, వేపపిండి తదితర వాడి ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తుల దిశగా రైతులు సాగుతున్నారు.

500 ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా 500 ఎకరాల వరకు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఈ విధానంలో భూసారం మరింత పెరగడం, దిగుబడి ఎక్కువగా పొందడం, వర్మీ కంపోస్ట్ తదితర వాటి గురించి వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయనిక ఎరువులు వాడకంతో



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన జొన్న పంట

భూములు క్రమేనా చౌడు బారడం గురించి తెలియజేస్తుండటంతో రైతన్నల ఆలోచనా దృక్పథం మారుతోంది. రసాయనిక ఎరువులతో పండించే పంటల కన్నా ప్రకృతి వ్యవసాయ పంటలే ఆరోగ్యానికి శ్రేష్ఠమని చెబుతుండటంతో ప్రజల్లో కూడా ఈ పద్ధతుల్లో పండించిన కూరగాయాలు, పంటల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మండలంలో తోటలు, మల్చూరి, కూరగాయలు .. ఇలా ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో పంటలు సాగు చేస్తున్నారు.

జీవామృతం తొట్ల నిర్మాణం

ఘన జీవామృతాన్ని పిడకల రూపంలో తయారు చేసి నిల్వ ఉంచుకునే రైతులు ద్రవ జీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెలు, క్యాన్లలో నిల్వ ఉంచడం చేసేవారు. అయితే ఈ ప్లాస్టిక్ క్యాన్లు చోరీలకు గురికావడంతో కొత్త ఆలోచనతో శ్రీకారం చుట్టారు. పొలానికి నీరు కాలువల పక్కనే సిమెంటు ఒరలతో లీటర్ల సామర్థ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మిస్తున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటు చేసి నీరు పారే కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడంవల్ల నీటితో కలిసి ద్రవ జీవామృతం సమంగా పొలానికి పారుతూ సత్ఫలితాలు ఇస్తుండడంతో రైతులు తమ పొలాల్లో శాశ్వత ద్రవ జీవామృత తొట్లను నిర్మించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగుచేస్తే అధిక దిగుబడి రావడంతోపాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుంది. సేంద్రియ ఎరువుల తయారీలో సందేహాలు ఉంటే 9618140527 నంబర్‌ను సంప్రదిస్తే వారికి అవగాహన కల్పిస్తాం. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యపరమైన పంటలవైపు రైతులను తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి, సింహాద్రిపురం

నులి పురుగులను నివారిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తదితరులు

వేంపల్లె : పిల్లల అనారోగ్యానికి కారణమైన నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని తహసీల్దార్ హరినాథరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లెలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరినాథరెడ్డి నులి పురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుండి జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమం జరుగుతుందని, పిల్లలకు ఆల్బెండజోల్ 400ఎంజీ మాత్రలను పంపిణీ చేస్తారన్నారు. ఏడాది నుంచి 19ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలందరికి పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా ఈ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఒకటి నుండి రెండేళ్ల వరకు సగం మాత్ర పొడి చేసి పాలలో కలిపి ఇవ్వాలన్నారు. మూడేళ్ల నుంచి 19ఏళ్ల వరకు ఆల్బెండజోల్ మాత్ర నమిలి మింగాలన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా, సీహెచ్ఓ వెంకట రత్నం, ఎంపీహెచ్ఇఓ ఫకృద్దీన్, సూపర్‌వైజర్ అరుణ కుమారి, ఐసీడీఎస్ స్వర్ణలత పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి ఆరాధన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి 354వ ఆరాధనా మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామ ప్రదక్షిణం, స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి వెండి కవచాలు, గజమాలలు, తులసీమాల, రంగురంగుల పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వేణుగోపాల స్వామికి విశేష పూజాకార్యక్రమాలను చేసి అలంకరణ చేశారు. లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, పవమాన హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. బళ్లారికి చెందిన ప్రణవాచార్, తిరుపతికి చెందిన ప్రహ్లాద్ ఆచార్, కుసుమర్తికి చెందిన పవన్‌జోషిల ఆధ్యాత్మిక ప్రసంగాల కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

నీట మునిగిన పంట పొలాలు

- బ్రహ్మంసాగర్ కాలువ తూము ధ్వంసంతో పంట పొలాలపై పారుతున్న నీరు
- లబోదిబోమంటున్న రైతులు

మైదుకూరు : ప్రకృతి వైపరీత్యాల వల్ల అతివృష్టితో పంటలు మునిగిపోవడం చూస్తుంటాం. కానీ మనుషులు పగబట్టి నీటి వనరులను సాటి మనుషులకు ముప్పుగా పరిణమించేలా చేసి ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలను నాశనం చేసేలా దారుణానికి ఒడిగడుతున్నారు. వారి చేష్టలకు వత్తాసు పలుకుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పచ్చని పంటలు నీట మునిగి రైతులకు తీరని ఆవేదనను మిగిల్చుతున్నాయి.

పంట పొలాలపై పారుతున్న నీరు

మైదుకూరు మండలం మిట్టమానుపల్లె పక్కనే వెళుతున్న బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు నీరందించే కాలువకు ఏర్పాటు చేసిన తూము కాంక్రీట్ మూతను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంతో రెండు రోజులుగా పెద్ద ఎత్తున నీరు పంట పొలాలను ముంచి వేస్తోంది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి కష్టపడి పండిస్తున్న పంటలు నీట మునగడంతో గ్రామానికి చెందిన రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని తెలుగు గంగ ఎస్సార్–2 నుంచి వెళ్లేల బ్రహ్మంసాగర్ కాలువకు మిట్టమానుపల్లె చెరువుకు నీటిని అందించేందుకు తూమును (పైపును అమర్చి) ఏర్పాటు చేశారు. ఆ తూము ద్వారా వచ్చే నీరు పెద్ద పరిమాణంలో ఉండి పొలాలకు ఇబ్బందిగా మారడంతో కొన్నేళ్ల కిందట తూము పైపునకు 75 శాతం మూసుకుపోయేలా కాంక్రీట్ మూతను ఏర్పాటు చేశారు. బ్రహ్మంసాగర్‌కు నీటిని వదిలినప్పుడల్లా తూము నుంచి వచ్చే పావు భాగం నీళ్లు రైతులకు ఇబ్బంది లేకుండా సరిపోయేవి. ఇటీవల బ్రహ్మంసాగర్‌కు నీటిని వదిలారు. తొలుత తక్కువ పరిమాణంలో నీరు ప్రవహిస్తున్న సమయంలో కొందరు దుండగులు కాలువ తూముకున్న కాంక్రీట్ మూతను ధ్వంసం చేశారు. కొద్ది రోజులుగా బ్రహ్మంసాగర్ కాలువలో నీటి పరిమాణం పెరగడంతో తూము నుండి పాయవంక ద్వారా అధిక మొత్తంలో నీరు ఉధృతంగా ప్రవహించి మిట్టమానుపల్లె చెరువు నిండిపోయింది. తూమును ధ్వంసం చేసిన సమయంలోనే దుండగులు చెరువు అలుగు అంచులను కూడా పగలగొట్టడంతో నీరు అలుగు ద్వారా దిగువనున్న పంట పొలాలపైకి మళ్లి పంటలను ముంచెత్తుతోంది. ఆదివారం భారీ వర్షం కురవడంతో వాన నీరు కూడా తోడైంది. తూము పగలగొట్టిన విషయాన్ని, ఇప్పుడు చెరువు అలుగు పారి నీరంతా పంటలను ముంచెత్తుతున్న విషయాన్ని తెలుగు గంగ అధికారులకు తాము చెప్పినా వారు పట్టించుకోలేదని గ్రామానికి చెందిన బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



బ్రహ్మంసాగర్ కాలువ తూము నుంచి పాయవంకలోకి ఉధృతంగా ప్రవహిస్తున్న గంగ నీరు

నీట మునిగిన పంటలు

నీటి ప్రవాహం వల్ల గ్రామానికి చెందిన అరికోటం పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు అనే అన్నదమ్ములు నాలుగు ఎకరాల్లో నాటేందుకు పోసిన వరి నారు మునిగిపోయింది. తోట శ్రీరాములు 1.30 ఎకరాల్లో సాగు చేసిన కొత్తిమీర, తోట సుబ్బరాయుడు 1.39 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట, ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు పంట మునిగిపోయాయి. కొండెబోయిన ఓబులేసు (బుజ్జి) 2 ఎకరాల్లో సాగు చేసిన అరటి, పల్లా గణపతి రెడ్డి 2.5 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట మునిగిపోయాయి. తోట వెంకటయ్య ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు, పుల్లయ్య 0.75 ఎకరాలో సాగు చేసిన మిరప పంట నీట మునిగాయి. కొండెబోయిన ఓబులేసు (మాజీ సర్పంచ్) ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు, శివయ్య ఒక ఎకరాలో సాగు చేసిన పసుపు పంట మునిగిపోయాయి. నీటిని ఎటూ మళ్లించే అవకాశం లేకపోవడంతో రైతులు మీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. మూడు నెలలపాటు బ్రహ్మంసాగర్‌కు నీటి సరఫరా ఉండే అవకాశం ఉండటంతో మునిగిన పంటలను రక్షించుకోలేక.. ఖాళీగా ఉన్న పొలాఆల్లో పంటలను సాగు చేసే అవకాశం లేక రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది.



నీట మునిగిన కొత్తిమీర పంట



నీటితో నిండిన పసుపు పంట

కొత్తిమీర మునిగిపోయింది



నాకున్న 1.30 ఎకారల్లో సాగు చేసిన కొత్తిమీర పంట నీటి వల్ల మునిగిపోయింది. పంట సాగుకు సుమారు రూ.50వేలు ఖర్చయింది. కొత్తిమీరకు డిమాండ్ వచ్చేసరికి పంట చేతికి అందాల్సి ఉంది. ఇప్పుడు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాను.

– తోట శ్రీరాములు, మిట్టమానుపల్లె, మైదుకూరు

వరి నారు, పొలం నీట మునిగాయి



నేను మా అన్న పెద్ద నరసింహులు నాలుగు ఎకరాల్లో నాటేందుకు వరి నారు పోశాం. వడ్లు, నారు కయ్య తయ్యారు చేసేందుకు రూ.7వేలు దాకా అయింది. అలుగు నీటితో నారు కయ్య నాటేందుకు సిద్ధం చేసిన పొలం పూర్తిగా మునిగిపోయింది. నీరు ఆగే అవకాశం లేనందువల్ల తిరిగి నారు పోసేందుకు కూడా వీలు లేదు.

– అరికోటం చిన్న నరసింహులు, మిట్టమానుపల్లె, మైదుకూరు

స్కౌట్ సామగ్రి పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్కౌట్ సామగ్రిని టెక్సాస్‌కు చెందిన లావనూరు రాధిక తనతల్లి భూమిరెడ్డి శైలజ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విద్యార్థులు చదవుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అవసరమని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రధానోపాధ్యాయుడు గురప్ప తమను స్కౌట్ సామాగ్రిని అందించాలని కోరడంతో దాతల సహకారంతో అందించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, సంస్థ ప్రధాన కార్యదర్శి కుండా మాధవ తదితరులు పాల్గొన్నారు.

వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలి

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన వాహన మిత్ర పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలు చేసి ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను ఆదుకోవాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నగేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆటో స్టాండ్ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే భారీగా జరిమానాలు విధించే జీఓ 21, 31 లను రద్దు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌లు తగ్గించాలని కోరారు. అలాగే డ్రైవర్లకు ఉచితంగా వ్యక్తిగత ప్రమాదబీమా పాలసీ అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, పట్టణ నాయకులు హరి, వెంకటేష్, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

ప్రొద్దుటూరు : ఎన్నికలపై లేవనెత్తిన సందేహాలకు, ఆరోపణలకు ఎన్నికల కమిషన్ సమాధానం ఇవ్వకుండా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదన్నారు. ఓటు విషయంలో మాత్రమే సమానత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుందని, రాజ్యాంగం మనకు ఇచ్చిన పవిత్రమైన ఓటు బీజేపీ అధికార దాహానికి బలి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దొడ్డిదారిన గెలిచేందుకు బీజేపీ ఎన్నికల కమిషన్‌ను కలుషితం చేయడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర వ్యవస్థ బీజేపీ చేతుల్లో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. ఓటు చోరీ గురించి రాహుల్ గాంధీ సవివరమైన ప్రజెంటేషన్ ద్వారా లేవనెత్తిన సందేహాలకు సమాధానం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.

ఆశా వర్కర్స్ మహాసభను జయప్రదం చేయండి

మైదుకూరు : ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వారు మైదుకూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30, 31 తేదీలలో కడప నగరంలో జరుగనున్నాయని తెలిపారు. మహాసభలలో ఆశా వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికను రూపొందించనున్నటు వివరించారు. నియోజకవర్గంలోని ఆశా వర్కర్లందరూ మహాసభల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు పీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బిట్టూ ఏఐ అసిస్టెంట్'ను సృష్టించిన యువకుడు



కె.ధనుంజయ్‌రెడ్డి

సింహాద్రిపురం : వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం జంగంరెడ్డిపల్లెకి చెందిన కె.ధనుంజయ్ రెడ్డి తన అద్భుతమైన ప్రతిభతో 'బిట్టూ ఏఐ అసిస్టెంట్' అనే ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేశాడు. ఇతను ప్రస్తుతం మదనపల్లె గోల్డెన్ వ్యాలీ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో డిప్లొమా చదువుతున్నాడు. ఈ ప్రాజెక్టు ద్వారా వాయిస్ కమాండ్ల ఆధారంగా పని చేసే రియల్ టైం ఆటోమేషన్, స్మార్ట్ ఇంటరాక్షన్ వంటి ఆధునిక సాంకేతికతలను విజయవంతంగా అమలు చేశారు. బిట్టూ ఏఐ అసిస్టెంట్ వినియోగదారుల ఆదేశాలను అర్థం చేసుకుని స్పందించగలదని, ఇంటర్నెట్ ద్వారా సమాచారాన్ని సేకరించి సహజ భాషలో సమాధానమిస్తుందని తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్లు, యూట్యూబ్, వెబ్ బ్రౌజర్ వంటి పనులను ఆటోమేటిక్‌గా నిర్వహిస్తుందన్నారు. సోమవారం ధనుంజయరెడ్డి మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు పెద్దబాసిరెడ్డి, శ్రీలత అందించిన ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించానని, క్యాంపస్‌లోని ల్యాబ్ సదుపాయాలు, అధ్యాపకుల మద్దతు ఎంతగానో తోడ్పడ్డాయన్నారు.

పొలాలకు, స్మశానానికి దారేదీ?

మైదుకూరు : మైదుకూరు–ప్రొద్దుటూరు రోడ్డులోని విశ్వనాథపురం వద్ద నేషనల్ హైవే 67 బైపాస్ బ్రిడ్జి సర్వీసు రోడ్డు నిర్మాణంతో పొలాలకు, స్మశానానికి వెళ్లే దారి మూసుకుపోయిందని సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సర్వీస్ రోడ్డు నుండి కేసీ కాలువ ఆయకట్టు పొలాలకు, స్మశానానికి వెళ్లే దారికి కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు సోమవారం స్థానిక కేసీ కాలువ సబ్ డివిజన్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, మండల సహాయ కార్యదర్శి ఎస్.బాలసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లు, సామగ్రిని ఆయా గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులకు అందజేశారు. రాగిమానుపల్లె, అచ్చివెళ్లి, ఎర్రిపల్లె, ఎర్రబల్లె–1, ఎర్రబల్లె–2, ఇ.కొత్తపల్లె పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నారు. పులివెందుల మండల పరిధిలోని ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

–పులివెందుల టౌన్



బ్యాలెట్ బ్యాక్స్‌ను తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది




ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు



ఎన్నికల విధులకు సిద్ధమవుతున్న పోలీసులు

వర్షం నీరు వెళ్లేదెలా.. సమస్యలు తీరేదెలా!



ముడుగును తలపిస్తున్న ఇమాంనగర్



జలమయమైన వేంపల్లె - పులివెందుల ప్రధాన రహదారి

- ఇమాంనగర్‌లో నిలిచిన వర్షపు నీరు
- కాలనీ వాసులకు తప్పని అవస్థలు

వేంపల్లె : కాలనీలోకి వచ్చిన వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేక పోవడంతో ఇమాంనగర్ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వారి అవస్థలు వర్ణతీ తం. రెండు రోజుల నుంచి వేంపల్లెలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన ఇమాంనగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో వర్షపు భారీ ఎత్తున నిలిచింది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇంట్లో ఉన్న వారు బయటికి రాలేకపోతున్నారు. వర్షం వచ్చిందంటే చాలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాలనీకి పారిన వర్షపు నీరు వెళ్లేందుకు సమస్యగా మారింది. సవ్యంగా పారేందుకు వీలు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఆ నీరంతా కాలనీలోని ఇళ్ల మధ్య చేరుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో నానా అవస్థలు పడుతున్నామని అంటున్నారు. నీరు నిల్వ ఉన్న విషయాన్ని టీడీపీ నేత మహమ్మద్ షబ్బీర్‌కు ప్రజలు ఫిర్యాదు చేయడంతో సోమవారం జేసీబీతో ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తను తొలగించినా.. నీరు మాత్రం అలాగే నిలిచిపోయింది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయిందని అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్యకు, ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డామంటున్నారు. ఇప్పుడు మళ్లీ వర్షాలు కురుస్తున్నాయని, మళ్లీ అవే అవస్థలు పడాల్సి వస్తుందని వారు వాపోయారు. ఇప్పటికైనా వర్షపు నీటిని తొలగించి రోగాలబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు.



వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన వర్షపు నీరు